


రామాలయానికి విరాళం

ఉప్పలగుప్తం: మండలంలోని పేరాయిచెరువులో రామాలయ నిర్మాణానికి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు శనివారం రూ.25 వేల విరాళాన్ని అందించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2000 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1300 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం 44.5° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.5	30.0
కాకినాడ	41.9	30.1
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవింద

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, ఇతర సేవలు, లడ్డూ విక్రయం, ఇతర విరాళాల రూపేణా స్వామి వారికి రూ.17,27,714 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి పి.ఫణిబాబు (అల్లవరం మండలం గోడి) రూ.10 వేలు, కె.సీతామహలక్ష్మి (అంకంపాలెం) రూ.10,116 చొప్పున విరాళాలు సమర్పించారు.

బాలబాలాజీ స్వామికి రూ.3.50 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.3.50 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.69 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.80,786 వచ్చాయి. స్వామివారిని 4,275 మంది భక్తులు దర్శించుకోగా, 3,489 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వేకువజాము నుంచే భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. తలనీలాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన శ్రీ బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదానానికి చింతపల్లి వాసుదేవరావు, విజయ భాగ్యమణి దంపతులు (సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం) రూ.10,100, గోశాలలో గో దాణాకు సన్నిధి పవన్‌కుమార్, శ్రీదేవి దంపతులు (పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి) రూ.10,116 చొప్పున విరాళాలు సమర్పించారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటాలను ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ డి.సాయిబాబు, ట్రస్టీలు పెదమల్లు ఉషారాణి, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్ అందజేశారు.

సంగీత్ జోరు.. బరాత్ హోరు

- సంప్రదాయ వివాహాల్లో వినూత్న మార్పులు
- ఉత్తర భారత్ పెళ్లి వేడుకల ఛాయలు
- మెహందీ, సంగీత్, బరాత్, హల్దీలకు మనవాళ్ల ఆసక్తి
- విందులోనూ ఉత్తరాది రుచులకు ప్రాధాన్యం


సంగీత్‌లో నృత్యహేల


బరాత్‌లో సందడి

సాక్షి, అమలాపురం: తెలుగువారి సంప్రదాయ పెళ్లిళ్లు కొత్త పోకడలను సంతరించుకుంటున్నాయి. ఇప్పటి వరకూ విఘ్నేశ్వరుని బియ్యం కట్టడం, పెళ్లి పందిరి రాట వేయడం, పెళ్లి కొడుకు, పెళ్లి కూతుళ్లను చేయడం, ఆపై వివాహం, అనంతరం యానాళ్లతో వివాహ తంతు ముగిసేది. కొన్ని పెళ్లిళ్లు మూడు రోజులు.. మరి కొన్ని ఐదు రోజులు జరిగేవి. కొన్ని ఇళ్లలో మాత్రమే అవిరేడు పెళ్లిళ్లు జరిగేవి. తెలుగు వారి పెళ్లిళ్లలో ఇవే ప్రధాన తంతులు. ఎవరి స్తోమతకు తగినట్టు వారు వివాహాలు చేసుకునేవారు. అంతకుమించి కొన్ని దశాబ్దాలుగా కొత్తదనం లేదు. కానీ గత ఐదేళ్లుగా తెలుగువారి పెళ్లి తంతుల్లో ఎన్నో కొత్త మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నిర్వహణలోనే కాదు.. విందూ వినోదాల్లో సైతం మనవాళ్ల వివాహాల్లో ఉత్తర భారత సాంస్కృతిక ఛాయలు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. సాధారణంగా వధూవరుల పేర్లు, కల్యాణ వేదిక, ముహూర్తం, విందు సమయం, కల్యాణకర్తల వివరాల వంటివి మాత్రమే పెళ్లి శుభలేఖల్లో ప్రధానంగా కనిపిస్తాయి. ఇప్పుడు కొత్తగా మెహందీ ఎప్పుడు, సంగీత్ ఎక్కడ, బరాత్, హల్దీ సమయాల వివరాలు కూడా శుభలేఖల్లో కనిపిస్తున్నాయి. ఉత్తరాది వివాహాల్లో మాత్రమే కనిపించే మెహందీ, బరాత్‌లు ఇప్పుడు తెలుగువారి వివాహాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మెహందీ

తెలుగువారి వివాహాల్లో వధూవరులకు గోరింటాకు పెట్టడం సంప్రదాయం. దీని స్థానంలో కోన్‌తో తయారు చేసే డిజైన్లు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఇలా రకరకాల డిజైన్లలో గోరింటాకు పెట్టడాన్ని కూడా ఇప్పుడు పెళ్లిలో ఒక ముఖ్య కార్యక్రమంగా మార్చేశారు. బంధుమిత్రులను పిలిచి మెహందీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

హల్దీ

వధూవరులను తయారు చేసినప్పుడు గతంలో సంప్రదాయ పూజలు మాత్రమే చేసేవారు. ఇప్పుడు వీటికి అదనంగా ఆటపాటలు అద్దారు. ఇందులో కూడా ఉత్తరాది పద్ధతిలో 'హల్దీ' పేరుతో కుటుంబ సభ్యులు, మిత్రులు సందడి చేస్తున్నారు.

మంగళస్నానం

మంగళ స్నానం కూడా ఆటపాటలతో చేసే సరదా కార్యక్రమంగా మారిపోయింది. పసుపు వస్త్రాలు, చలువ కళ్లద్దాలు ప్రత్యేక డ్రెస్ కోడ్‌గా మారాయి. ఒకరి మీద ఒకరు నీళ్ల జల్లుకోవడం, పసుపు ముద్దలు రాసుకోవడం అన్నీ ఉత్తరాది బాటలోనే సాగుతున్నాయి.

హోరెత్తుతున్న బరాత్

వివాహానికి వధూవరులను ఊరేగింపుగా తీసుకువెళ్లడం ఎప్పటి నుంచో ఉన్నదే. బ్యాండుమేళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, జిగేల్మనే విద్యుద్దీపాల వెలుగుల్లో బంధుమిత్రులు డ్యాన్సులూ కొన్నాళ్లుగా ఉన్నవే. దీనికి ఉత్తరాది 'బరాత్'ను జోడించారు. బ్యాండుమేళాల స్థానంలో అదనంగా డీజేలు వచ్చాయి. పల్లకీలు, ఊరేగింపు వాహనాలు సైతం కొత్తకొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. అంబారీలు, గుర్రాలు, కొత్త తరహా విద్యుద్దీపాల సెట్టింగులు.. తెలుగు, హిందీ ఫాస్ట్‌బీట్ పాటలతో సాగే బరాత్‌తో ఊళ్లు హోరెత్తుతున్నాయి. బాణసంచా కాల్పుల్లో కూడా కొత్తదనం తీసుకువస్తున్నారు.

సంగీత్


మెహందీ


అతిథులకు ఉత్తరాది వంటకాలు సిద్ధం

సండే స్పెషల్

పెళ్లికే కాదు.. ఇందులో ప్రత్యేక ఆకర్షణగా రూపుదిద్దుకుంటున్న 'సంగీత్'కు సైతం ప్రత్యేకంగా ఫంక్షన్ హాల్ అద్దెకు తీసుకుంటున్నారు. మరి కొంతమంది ఇళ్ల వద్ద, కొబ్బరి తోటల్లో ప్రత్యేకంగా సెట్‌లు వేసి మరీ సంగీత్ నిర్వహిస్తున్నారు. వధూవరులతో పాటు ఇరువైపులా పరివారం అంతా కలిసి పాటలకు జోరుగా డ్యాన్సులు చేస్తున్నారు. ఇందుకు రిహార్సల్స్ సైతం నిర్వహిస్తున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి పొద్దు పోయే వరకూ ఆటపాటలతో గడుపుతున్నారు. దీనికోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్తరాది రుచులకే అగ్రస్థానం

కల్యాణ తంతులోనే కాదు.. వివాహ విందులో సైతం ఉత్తరాది రుచులు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. సంగీత్ వంటి నృత్య కార్యక్రమాలు గంటల తరబడి సాగుతూంటాయి. దీని వల్ల ఒక్కసారి భోజన ఏర్పాటు చేసి వదిలేస్తే ఎలా? అందుకే సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకూ విందు ఏర్పాటు చేస్తున్నారు. చాట్‌లు, పానీపూరీలు, వెజ్ టిక్కాలు, మలయ్ కోఫ్తా, చోలా భటూర, దహీపూరీ, మినీ సమోసా, డోక్లా, భేల్ పూరీ వంటివి అందుబాటులో ఉంచుతున్నారు. సూప్‌లు, రోల్స్, ఉత్తర భారతంలో దొరికే స్వీట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే సంప్రదాయ రుచుల స్థానంలో ఉత్తరాది రుచులు ఎన్నెన్నో!


పెళ్లి కూతురిని చేసే వేడుకకు అదనపు హంగులు

సంప్రదాయానికి అదనం



పెళ్లిళ్లు చాలా ఘనంగా చేస్తున్నారు. కొత్త పోకడలు వస్తున్నాయి. ఉత్తరాది పెళ్లిళ్లలో చేసే మెహందీ, బరాత్, సంగీత్ మనకు కూడా చేస్తున్నారు. నార్త్ ఇండియా స్నాక్స్ కావాలని ప్రత్యేకంగా చేయించుకుంటున్నారు. డెస్టినేషన్ మ్యారేజ్ తరహాలో రిసార్ట్స్, నది, సముద్ర తీరాల్లో ప్రత్యేకంగా సెట్‌లు వేసి మరీ పెళ్లిళ్లు చేస్తున్నారు. ఎన్ని కొత్త పోకడలు వచ్చినా పెళ్లిలో మన సంప్రదాయాన్ని మాత్రం వీడటం లేదు.

– బొట్టా అనిల్ కుమార్, ఏఆర్‌కే ఎంటర్‌టైన్‌మెంట్స్

శ్లాబు దశకు చేరుకున్న వంతెన పనులు


కాలువకు నీరు వచ్చినా శ్లాబు నిర్మాణానికి ఆటంకం లేకుండా ఖానాల మధ్య ఏర్పాటు చేసిన క్రిబ్స్

పి.గన్నవరం: వశిష్ఠ నదిపై రూ.49.5 కోట్లతో చేపట్టిన వంతెన పనులు చకచకా సాగుతున్నాయి. దీనికి అనుసంధానంగా ప్రధాన పంట కాలువపై తొలుత చేపట్టిన వంతెన పనులు శ్లాబు దశకు చేరుకున్నాయి. ఈ కాలువకు నీరు విడుదల చేసినందున శ్లాబు పనులకు ఇబ్బందులు లేకుండా వంతెన ఖానాల మధ్య క్రిబ్స్ ఏర్పాటు చేశారు. దీని వలన కాలువలో నీరు ప్రవహిస్తున్నా వంతెన శ్లాబు పనులు జరుగుతాయని పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ డీఈఈ అన్యం రాంబాబు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో బేరింగులు ఏర్పాటు చేసి, రెండు ఖానాలపై ఒకేసారి శ్లాబు నిర్మిస్తామని చెప్పారు. గత ఏడాది వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామస్తుల కోసం రూ.49.5 కోట్లతో వంతెన నిర్మాణానికి అన్ని అనుమతులూ ఇచ్చారు. దీంతో వశిష్ఠ నదిపై వంతెనకు అనుసంధానంగా ప్రధాన పంట కాలువపై రూ.2.8 కోట్ల వ్యయంతో గత నెల 14న వంతెన పనులు ముందుగా ప్రారంభించారు. దీని పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి. కాలువపై వంతెన శ్లాబు వేసిన తర్వాత నదీపాయపై వంతెన పనులను ప్రారంభిస్తారు. ఈ పనుల కారణంగా బెల్లంపూడి – జి.పెదపూడి రోడ్డులో నిలిపివేసిన బస్సులు, లారీల రాకపోకలను శనివారం పునరుద్ధరించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యాన మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ముఖ్య క్రీడా శిక్షకుడు పి.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈ నెల 23, 24 తేదీల్లో అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత సాధిస్తారని తెలిపారు. నాలుగో తరగతికి 2014 ఆగస్టు 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. అలాగే ఐదో తరగతికి 2013 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31 మధ్య పుట్టి ఉండాలని తెలిపారు. ఎంపికలకు వచ్చే వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు అందించాలన్నారు. వివరాలకు 79933 29433 నంబర్‌లో సంప్రదించాలని సురేష్‌కుమార్ సూచించారు.

ఉద్యోగుల మనస్సుల్ని గెలుచుకున్న సీఎం


హరిధర్‌రావు

కాకినాడ రూరల్: ఇటీవలి క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న గొప్ప నిర్ణయాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల మనసుల్ని గెలుచుకున్నారని ఉత్తరాంధ్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బడగల హరిధర్‌రావు అన్నారు. రమణయ్యపేటలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 12వ పీఆర్సీ వేయడంతో పాటు సుమారు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కేబినెట్‌లో నిర్ణయించారన్నారు. అలాగే, కొత్తగా 7 వేల ప్రభుత్వ ఉద్యోగుల నియామకం ద్వారా నిరుద్యోగులకు అవకాశం లభిస్తుందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, అందరికీ ఆమోదయోగ్యంగా జీపీఎస్ విధానం తీసుకురావడం ఆనందించదగ్గ విషయమని, ఇటువంటి నిర్ణయాలు చరిత్రాత్మకమని వివరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మారిస్తే వారి బతుకులు బాగుంటాయని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని హరిధర్‌రావు కోరారు.

రూ.2.20 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు

రామచంద్రపురం రూరల్: ఓ వ్యక్తి నుంచి సైబర్ కేటుగాళ్లు రూ.2.20 లక్షలు కొట్టేశారు. ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై ఎన్.భుజంగరావు కథనం ప్రకారం.. విద్యుత్ బిల్లు చెల్లించలేదని, అర్జెంటుగా ఓ నంబర్‌కు ఫోను చేయాలంటూ యనమదల గ్రామానికి చింతపల్లి రంగారావు మొబైల్‌కు ఈ నెల 7న మెసేజ్ వచ్చింది. దీంతో రంగారావు ఆ నంబరుకు ఫోన్ చేశాడు. అవతలి వ్యక్తి విద్యుత్ బోర్డు మేనేజర్‌ను మాట్లాడుతున్నానని చెబుతూ అకౌంటు వివరాలు, ఓటీపీలు సేకరించి 3 దఫాలుగా సొమ్ము కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై భుజంగరావు తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం


నిందితులను చూపుతూ మీడియాతో మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్

- కోరుకొండ యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- 8 మంది నిందితుల అరెస్టు
- చాకు, 7 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం

మధురపూడి: యువకుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే అతడి హత్యకు దారి తీసిందని నిర్ధారించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై కట్టా శారదా సతీష్‌తో కలిసి సీఐ ఉమామహేశ్వరరావు ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. హతుడు ముప్పిడిశెట్టి శ్రీను (34) స్వగ్రామం కోరుకొండ మండలం గాడాల. అతడు కోరుకొండలోని వెంకటగిరి లైటింగ్స్ అండ్ డెకరేటర్స్ సప్లై కంపెనీ యజమాని వెంకటగిరికి అల్లుడు. సప్లై కంపెనీ వ్యవహారాలను శ్రీనే చూసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని ఎస్ఆర్ నగర్‌లో ఉన్న సప్లై కంపెనీ గోడౌన్ వద్ద గుర్తు తెలియని దుండగులు అతడి కళ్లల్లో కారం చల్లి, పొట్టలో కత్తులతో పొడిచి, పరారయ్యారు. ఆసుపత్రికి తరలించే లోపే శ్రీను మృతి చెందాడు. దీనిపై అతడి మామ వెంకటగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

మూడు నెలలుగా రెక్కీ

కర్నూలు జిల్లా దేవనకొండ గ్రామానికి చెందిన సబ్బు నాగార్జునరెడ్డి అలియాస్ అర్జున్‌రెడ్డి అలియాస్ అర్జున్ అలియాస్ నాగు కోరుకొండలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ప్రస్తుతం రాజానగరంలో నివాసం ఉంటున్నాడు. నాగార్జునరెడ్డితో పాటు ముప్పిడిశెట్టి శ్రీనుకు కోరుకొండ గ్రామానికి చెందిన వివాహిత కాళ్ల నాగలక్ష్మితో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునరెడ్డితో వ్యవహారాన్ని బయట పెడతానంటూ శ్రీను ఆమెను హెచ్చరించాడు. దీంతో విషయం తన భర్తకు తెలుస్తుందని నాగలక్ష్మి భయపడింది. ఈ విషయాన్ని తన స్నేహితురాలు, కోరుకొండకు చెందిన ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకురాలు ముత్యాల పద్మావతికి చెప్పింది. శ్రీనును హతమారిస్తే తప్ప ఈ సమస్య నుంచి బయట పడలేమని భావించిన వీరిద్దరూ ఈ విషయాన్ని నాగార్జునరెడ్డికి చెప్పారు. దీంతో శ్రీను హత్యకు నాగార్జునరెడ్డి, అతడి మిత్రులు గొడ్డు దిలీప్ (రాజానగరం), చొప్పెల్ల వెంకటేశ్ (రాజానగరం), సయ్యద్ అహ్మద్ (రాజానగరం), ఇంజమూరి రాజేంద్రప్రసాద్ (అనంతపురం జిల్లా గుత్తి – ప్రస్తుతం రాజానగరంలో ఉంటున్నాడు), కొవ్వాడ విజయ్‌కృష్ణ (గుమ్ములూరు, కోరుకొండ మండలం) పథక రచన చేశారు. ఈ నేపథ్యంలో అమెజాన్ నుంచి ఆన్‌లైన్‌లో కత్తి తీసుకున్నారు. మూడు నెలలుగా అదను కోసం వేచి చూస్తున్నారు. రెక్కీ నిర్వహించారు.

వెంబడించి.. హతమార్చి..

గ్రామ దేవత అంకాలమ్మ జాతర సందర్భంగా శ్రీను గత ఆదివారం రాత్రి పశ్చిమ గోనగూడెం రోడ్డులోని సప్లై కంపెనీ గోడౌన్‌కు ఒంటరిగా వెళ్తూ కనిపించాడు. అతడిని నాగార్జునరెడ్డి, గొడ్డు దిలీప్ మోటార్ సైకిల్‌పై వెంబడించారు. గోడౌన్ తలుపు కొట్టి, బయటకు వస్తున్న శ్రీను కళ్లల్లో కారం జల్లారు. నాగార్జునరెడ్డి, వెంకటేశ్‌లు శ్రీను చేతులు పట్టుకోగా దిలీప్ కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం నిందితులు పరారయ్యారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు హతుడు శ్రీను గురించి ఆరా తీశారు. దీంతో వివాహేతర సంబంధం విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ తీగ లాగితే మొత్తం డొంకంతా కదిలింది. నిందితుల సెల్‌ఫోన్ల కాల్‌డేటా, సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా నిందితులు నాగార్జునరెడ్డి, దిలీప్, వెంకటేశ్, సయ్యద్ అహ్మద్, ఇంజమూరి రాజేంద్రప్రసాద్‌లను రాజానగరంలో అరెస్టు చేశారు. అలాగే కోరుకొండలో నాగలక్ష్మిని, పద్మావతిని, గుమ్ములూరులో కొవ్వాడ విజయ్‌కృష్ణను అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు మోటార్ సైకిళ్లు, ఒక కారు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు, డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై కట్టా శారదా సతీష్, తన సిబ్బందితో వివిధ బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసి, ఈ కేసు మిస్టరీని ఛేదించారు. సాంకేతిక నిపుణుల సహాయం తీసుకున్నారు. వీరిని ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు అభినందించారు.

మరదలిపై హత్యాయత్నం

- ఆపై రైలు కింద పడి బావ ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన క్షణికావేశం


సత్యనారాయణ (పాత చిత్రం)

నల్లజర్ల: క్షణికావేశంలో మరదలిపై హత్యాయత్నానికి ఒడిగట్టి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతినీడుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై శ్రీహరిబాబు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన పెదపూడి సత్యనారాయణ (33) చిన్నతనం నుంచీ పోతినీడుపాలెంలోని మేనమామ ఇంట పెరిగాడు. మేనమామ తన పెద్ద కుమార్తెకు, సత్యనారాయణకు మూడేళ్ల కిందట వివాహం చేశాడు. సత్యనారాయణ 'సాయి శ్రీనివాసా' పేరిట బ్యాండు ట్రూపు ఏర్పాటు చేసి, మేనమామ ఇంట్లోనే నివసిస్తున్నాడు. ఈ ట్రూపులోనే సత్యనారాయణ మేనమామ రెండో కుమార్తె పాటలు పాడేది. ఈ క్రమంలో బావకు, ఆమెకు మధ్య ప్రేమ వ్యవహారం మొదలైందని పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఆమెకు పెళ్లి కుదిరింది. వరుడు కొనిచ్చిన సెల్‌ఫోన్‌లో ఆమె తరచూ మాట్లాడుతూ బావకు దూరంగా ఉంటోంది. తనకు ఆమె దూరమవుతోందని సత్యనారాయణ అక్కసు పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మాట్లాడే పని ఉందంటూ ఆమెను గ్రామంలోని కానూరి సత్యనారాయణ పామాయిల్ తోటకు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య ఏం జరిగిందో ఏమో కానీ ఆమె మెడపై సత్యనారాయణ కత్తితో పొడిచాడు. చనిపోయిందని భావించి బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం చాటపర్రులోని ఉన్న తన సోదరి ఝాన్సీకి ఫోన్ చేశాడు. తన మరదలిని చంపేశానని, తాను కూడా రైలు కింద తల పెట్టి చనిపోతానని, తన గురించి వెతకవద్దని చెప్పి, ఫోన్ పెట్టేశాడు. దీంతో ఝాన్సీ తన బంధువులందరినీ అప్రమత్తం చేసింది. భీమడోలు మండలం కొండ్రుపాడు రైల్వే గేటు వద్ద రాత్రి 11 గంటల సమయంలో రైలు కింద పడి సత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి బైక్ కూడా అదే ప్రాంతంలో లభ్యమైంది. ఝాన్సీ ఇచ్చిన సమాచారంతో సత్యనారాయణ మేనమామ కుటుంబ సభ్యులు సమీపంలోని అన్ని పామాయిల్ తోటల్లో గాలించారు. రెండు గంటల అనంతరం రక్తపు మడుగులో ఉన్న బాధిత యువతిని గుర్తించి, ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. తన కుమార్తెపై అల్లుడే దురాగతానికి పాల్పడ్డాడని తెలిసి ఆమె తల్లి సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను కూడా ప్రత్యేక వాహనంలో తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని నల్లజర్ల సీఐ నున్న రా జు, ఎస్సై నరసింహమూర్తి శనివారం ఉదయం సందర్శించారు. తమ రెండో కుమార్తెకు పెళ్లి కుదిరిందని, ఈ నేపథ్యంలో బ్యాండు ట్రూపులో పాటలు పాడనని చెప్పడంతో అల్లుడు సత్యనారాయణ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం జగన్.. ఉద్యోగుల పక్షపాతి


ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కొనియాడారు. ప్రజా సంక్షేమం మాదిరిగానే ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఆయన పరితపిస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత కూడా సీఎం జగన్‌దేనని అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను 10 ప్రభుత్వ శాఖల్లో క్రమబద్ధీకరించారని తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు ఇచ్చేలా చేయడం, 6,840 కొత్త పోస్టులు మంజూరు చేయడం, 12వ పీఆర్సీకి ఆమోదం తెలపడం వంటి వాటి ద్వారా ఉద్యోగుల పట్ల తనకున్న అభిమానాన్ని ముఖ్యమంత్రి జగన్ మరోసారి వ్యక్తం చేశారని వివరించారు. ఈ మేరకు రాష్ట్ర ఉద్యోగుల తరఫున సీఎంకు ఇజ్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

చాట్‌బాట్‌తో మరో 150 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: చాట్‌బాట్ యాప్ ద్వారా మరో 150 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసు శాఖ రికవరీ చేసింది. ఇప్పటి వరకూ జిల్లా పోలీసులు ఈ యాప్ ద్వారా మూడు దఫాలుగా మొత్తం 412 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మూడో దఫా రికవరీ చేసిన 150 ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సుసరాపు శ్రీధర్ శనివారం బాధితులకు అందజేశారు. చోరీకి గురైన, పోగొట్టుకున్న తమ ఫోన్లను చాట్‌బాట్ ద్వారా త్వరితగతిన అందజేసిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకుంటే నానా అవస్థలూ పడాల్సి వచ్చేదని, ఇప్పుడు పోలీసులు ఉపయోగిస్తున్న చాట్‌బాట్ ద్వారా తక్కువ సమయంలోనే ఫోన్ వెతికిపెట్టి తెచ్చి ఇచ్చారని ఓ బాధితుడు చెప్పారు. చాట్‌బాట్ యాప్‌ను బాధితులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఫోన్ల రికవరీలో వేగవంతమైన సత్ఫలితాలు వస్తున్నాయని ఎస్పీ శ్రీధర్ అన్నారు. దొరికిన సెల్ ఫోన్లను సొంతానికి వాడుకోరాదని, అలాగే గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా, బిల్లులు లేని ఫోన్లు కొనరాదని సూచించారు. ఎవరికైనా ఫోను దొరికితే దానిని దగ్గర్లో ఉన్న పోలీసు స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యాన పని చేస్తున్న సెల్ ట్రాకింగ్ టీమ్‌లోని క్రైమ్ సీఐ డి.గోవిందరావు, స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, ఎస్సైలు జి.నరేష్, జె.భానుప్రసాద్, సంపత్‌కుమార్, ఫణిమోహన్, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

టైరు మారుస్తుండగా.. దూసుకొచ్చిన మృత్యువు

- డ్రైవర్ దుర్మరణం
- నలుగురికి గాయాలు

పిఠాపురం: కారు రూపంలో మృత్యువు దూసుకు రావడంతో ఓ వ్యాన్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం.. తాడేపల్లిగూడేనికి చెందిన పవన్ (30) వ్యాన్ డ్రైవర్. తాడేపల్లిగూడెం నుంచి శుక్రవారం రాత్రి విశాఖకు వెల్లుల్లిపాయల లోడు వేసుకుని వ్యాన్‌పై బయలుదేరాడు. గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం సెంటర్ వద్దకు శనివారం తెల్లవారుజామున చేరుకున్నాడు. అక్కడకు వచ్చేసరికి టైరులో గాలి తగ్గిపోయింది. దీంతో వ్యాన్‌ను రోడ్డు డివైడర్ పక్కన ఆపి టైరు మార్చుకుంటున్నాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఇన్నోవా కారు అతి వేగంగా దూసుకు వచ్చి, టైరు మార్చుకుంటున్న డ్రైవర్ పవన్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న విశాఖపట్నానికి చెందిన మాకిన పూర్ణచంద్రరావు, రామలక్ష్మి రమ్య, మారుపల్లి భార్గవి, ఎం.ప్రసాద్ గాయపడ్డారు. వీరందరూ పెళ్లి పనుల కోసం విజయవాడ వెళ్లి వస్తున్నారు. వీరిని బంధువులు మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి.. పవన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌతమీ గోదావరిలో యువతి మృతదేహం

తాళ్లరేవు: గౌతమీ గోదావరిలో గోవలంక వద్ద శనివారం గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ కథనం ప్రకారం.. సుమారు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతి మృతదేహం ఉదయం కనిపించినట్టు గోవలంక వీఆర్‌ఓ కోరింగ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సుమారు 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయలో ఉన్న ఆ యువతి ఎరుపు రంగు లెగ్గింగ్, గులాబీ రంగు టాప్ ధరించి ఉంది. మృతురాలి కుడి చేతిపై ఒకవైపు 'శివ' అని, మరో వైపు 'అమ్మ' అని పచ్చబొట్లు ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలిసిన వారు కోరింగ పోలీస్ స్టేషన్‌లో నేరుగా లేదా 0884–2303533, 94407 96558 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై కోరారు.